క్లుప్తంగా

కాంగ్రెస్ నాయకుల హర్షం

వీపనగండ్ల: నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు చింతలపల్లి జగదీశ్వర్‌రావుకు ఆదివారం ప్రభుత్వం రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ సంస్థ చైర్మన్ నియమించడంపై మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ఆయన కృషి చేశారని విజయభాస్కర్‌రెడ్డి, రాజశేఖర్, వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



కొత్తకోట రూరల్: పట్టణంలోని 5వ వార్డుకు చెందిన దారమోని ప్రవీణ్ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. వైద్యానికి పెద్ద మొత్తంలో ఖర్చవుతుండటంతో కుటుంబసభ్యులు ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.1.50లక్షల ఎల్‌ఓసీ మంజూరు కాగా, ఆదివారం వారికి అందించారు.

కంటి వైద్య శిబిరం



మదనాపురం: మండలంలోని దంతనూరులో ఆదివారం సత్యసాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వైస్ ఎంపీపీ యాదమ్మ, పీఏసీఎస్ వైస్ చైర్మన్‌వీర్ల శ్రీనివాసులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో రాఘవేందర్, పాండు, అలివేలమ్మ, నిర్వాహకులు కృష్ణయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పాఠశాల ప్రహరీ



అమరచింత: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడలను గుర్తుతెలియని వ్యక్తులు కూలగొడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానుండటంతో పరీక్ష కేంద్రంగా కొనసాగుతున్న జెడ్పీహెచ్‌ఎస్ ప్రహరీ రంధ్రాన్ని మూసివేయలేకపోతున్నారు. కేంద్రం వద్ద 144 సెక్షలు అమలు పరుస్తున్నామని చెబుతున్న అధికారులు పాఠశాల చుట్టూ ఉన్న ప్రహరీని కూల్చిన వారిని గుర్తించి చర్యలు తీసుకోలేకపోవడంతో, అదే దారి వెంట పాఠశాల మైదానం నుంచి బీసీ కాలనీకి చెందిన ప్రజలు రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి పూడ్చివేయాలని కోరుతున్నారు.

ఈతకెళ్తున్నారా.. జర జాగ్రత్త!



పాన్‌గల్: వేసవి వచ్చిందంటే చాలు యువత, చిన్నారులు చెరువులు, కాల్వల్లో స్నానాలకు వెళ్తుంటారు. సరదాగా వేసవి తాపం తీరుకోవడానికి వెళ్లి వారి కుటుంబాలకు తీరని శోకం మిగులుస్తున్నారు. ఇలా సరదా విషాదం నింపిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఈ వేసవిలో అయినా కనీస జాగ్రత్తలు పాటించి సరదా సమయాన్ని విషాదం కాకుండా చుసుకోవాలని నిపుణులు పేర్కొంటున్నారు.

- 15 ఏళ్ల లోపు పిల్లలు చెరువులు, కుంటలు, వాగుల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు చూసుకోవాలి.
- తల్లిదండ్రులు తీసుకెళ్తే మోకాలు, నడుము లోతు వరకే దిగేలా చూడాలి.
- శిక్షకుడి పర్యవేక్షణలో ఈత నేర్పించాలి.
- యువత మద్యం, మత్తు పదార్థాలు తీసుకొని నీటిలోకి దిగవద్దు.
- పాఠశాలలకు ఒంటి పూట బడి ఉండటంతో బడి వదిలిన వెంటనే విద్యార్థులు ఈతలకు వెళ్లే అవకాశాలు ఉన్నాయి. తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకుంటే బాగుంటుందని నిపుణులు సూచిస్తున్నారు. దీంతో పాటు పోలీసులు కూడా గ్రామాల్లో ఈతకు వెళ్లే వారికి అవగాహన కల్పిస్తే ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉంటాయని పలువురు వాపోతున్నారు.

మైసమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

పెద్దకొత్తపల్లి: నాయనోనిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి మైసమ్మ దేవతకు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. గద్వాల, పెబ్బేరు, కొల్లాపూర్, అయ్యంపేట, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి ప్రాంతాల నుంచి ప్రైవేటు వాహనాలలో తరలివచ్చారు. కొత్తగా వాహనాలు కొనుగోలు చేసిన భక్తులు మైసమ్మ దేవత వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

అధ్వానంగా రహదారులు

- పూర్తిగా ధ్వంసమైన మూలమల్ల రహదారి
- పదేళ్లుగా ప్రయాణికుల పాట్లు



సింగంపేట శివారులో గుంతలమయంగా మారిన రోడ్డు



ఆత్మకూర్ శివారులో కంకరతేలిన మూలమల్ల రహదారి

ఆత్మకూర్: ప్రయాణం.. నరకప్రాయంగా మారింది. ఏళ్లు గడుస్తున్న పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలోని మూలమల్ల, నందిమల్ల గ్రామాలకు, జూరాల ప్రాజెక్టుకు వెళ్లేందుకు ఆత్మకూర్ పెట్రోల్‌బంకు మలుపునుండి మొదలుకుని 7కిలో మీటర్ల మేర బీటీరోడ్డను వేశారు. 2004లో వేసిన రోడ్డు ప్రస్తుతం పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారింది. గుంతలమయమైన రోడ్డును మరమ్మతులు లేకుంటే కొత్త బీటీరోడ్డు వేయించాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్న ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు వాపోతున్నారు. నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని మూలమల్ల, నందిమల్ల గ్రామస్తులు కోరుతున్నారు.

రూ.8.50 కోట్లు మంజూరు..

మూలమల్ల మలుపు నుంచి నందిమల్ల, జూరాల ప్రాజెక్టు వరకు రూ.8.50 కోట్ల నిధులతో 2016లో రోడ్డు పనులు అట్టహాసంగా ప్రారంభించారు. మొదటి దఫా నిధులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ రోడ్డు పనులను మధ్యలోనే వదిలేశాడు. ఈవిషయమై గ్రామస్తులు పలుమార్లు పీజేపీ కార్యాలయం వద్ద ధర్నా చేసిన నిధులలేమితో పనులు ముందుకెళ్లలేదు. పంచాయతీరాజ్ నిధుల నుంచి రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామస్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.

నిత్యం ప్రమాదాలు



నందిమల్ల నుంచి మూలమల్ల మీదుగా ఆత్మకూర్‌కు వెళ్లాలంటే భయమేస్తోంది, నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇది వరకే ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్న పనులు జరగడం లేదు. ఈ విషయాన్ని కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకెళ్లాం.

– రాజేందర్‌రెడ్డి, నందిమల్ల, అమరచింత మండలం

అధికారుల అసమర్థత..



2016లో పుష్కరాలప్పుడు మంజూరైన రోడ్డు పనులు నేటికి పూర్తికాకపోవడం పాలకులు, అధికారుల అసమర్థతనే కారణం. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా, ప్రయాణికులు చనిపోతున్నా స్పందించకపోవడం పాలకుల పనితీరుకు నిదర్శనం. వెంటనే పనులను ప్రారంభించకపోతే పెద్ద ఎత్తను ఉద్యమిస్తాం.

– మోష, మూలమల్ల, ఆత్మకూర్ మండలం

ఉద్యోగికి సాధికారత అవార్డు



అవార్డును అందుకుంటున్న శ్రీవాణి

వనపర్తిటౌన్: మహిళా శిశు సంక్షేమ శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్న పట్టణానికి చెందిన డీహెచ్‌ఈడబ్ల్యూ జెండర్ స్పెషలిస్ట్ శ్రీవాణి సేవలకుగాను ఆదివారం హైదరాబాద్‌లో ఫర్ యాంటీ కరప్షన్ ముందడుగు ఫౌండేషన్ వారు మహిళా సాధికారత 2024 అవార్డును అందజేశారు. 2008 నుంచి మహిళల, బాలికల, వృద్ధుల సమస్యలపై, మహిళా సంఘాల సభ్యురాలిగా, 2015లో పోలీస్ డిపార్ట్‌మెంట్ తరపున ఫ్యామిలీ కౌన్సెలింగ్ మెంబర్‌గా ఎన్నో కుటుంబకలహాలను పరిష్కరించారు. ఆర్డీఎస్, సఖి స్వచ్ఛంద సంస్థలో ఎన్నో సామాజిక, కుటుంబ, ఆర్థిక సమస్యల్లో ఉన్న మహిళలకు తన సహాయసహకారాలను అందిస్తున్న శ్రీవాణికి అవార్డు రావడంపై పలు మహిళా సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లా సరిహద్దులో చెక్‌పోస్టు



నాగల్‌కడ్మూర్ చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

అమరచింత: ఎంపీ, ఎంఎల్‌సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని నాగల్‌కడ్మూర్ శివారులో పోలీస్ చెక్‌పోస్టును ఏర్పాటు చేశామని ఎస్‌ఐ సురేష్ కుమార్ తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం ప్రజలు రూ.50 వేల మేరకు నగదు, ఆభరణాలను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తే రశీదులు వెంట తీసుకెళ్లాలని సూచించారు. అక్రమంగా మద్యం రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. నారాయణపేట జిల్లా సరిహద్దులో చెక్‌పోస్టు ఏర్పాటు చేసి కేంద్ర బలగాలతో వాహనాల తనిఖీలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

కొత్తకోట రూరల్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులోకి వచ్చిన సందర్భంగా పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. పెద్దమందడి మండలం మోజర్లస్టేజీ సమీపంలో బుర్రవాగు వద్ద ఎన్‌హెచ్–44పై చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు సీఐ రాంబాబు, ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. కోడ్ అమలులో ఉన్నందున నిబంధనల ప్రకారం నడుచుకోవాలని హెచ్చరించారు.

వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

వనపర్తిటౌన్: వాల్మీకి బోయ ఫెడరేషన్ ఏర్పాటు చేసి వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర వాల్మీకి బోయ సంఘం ఐక్య కార్యచరణ కమిటీ సభ్యులు ఉమ్మల్ల రాములు, మండ్ల దేవన్న నాయుడు కోరారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఐదు లక్షల మందికి పైగా వెనుకబడి ఉన్న వాల్మీకి బోయలను ప్రభుత్వం గుర్తించి ఎస్టీ జాబితాలో చేర్చాలని, ఇటీవల రాష్ట్రం ప్రకటించిన 16 కార్పొరేషన్ ఫెడరేషన్‌లో వాల్మీకి బోయల పేరు లేకపోవడం విస్మయానికి గురిచేస్తుందన్నారు. గత ప్రభుత్వం వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చుతామని హామీ ఇచ్చి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రఘుపతి నాయుడు, నాగార్జున, నరసింహనాయుడు, చిన్న అంజి, సురేష్, శివయ్య నాయుడు, వెంకటేష్, రామచంద్రయ్య, యశ్వంత్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం..

డాక్టర్ జిల్లెల మాధవరెడ్డి స్మారకార్థం ఆదివారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌చౌక్‌లో చలివేంద్రాన్ని చిన్నారెడ్డి ప్రారంభించారు.

గోపాల్‌పేట: మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చిన్నారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని తాడిపర్తి మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను ముస్లింలు శాలువలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆదిత్యరెడ్డి, వెంకటేష్, ప్రవీణ్‌కుమార్, దేవరాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మదనాపురం: మండలంలోని దుప్పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1998–99లో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన నిర్వహించారు. 25 ఏళ్ల తర్వాత ఒక చోట చేరుకుని వారి చిన్ననాటి అనుభవాలను నెమరువేసుకున్నారు. అనంతరం వారికి విద్యను బోధించిన గురువులకు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో రాంరెడ్డి, కురుమన్న, బెల్లం సాయులు, కరుణాకర్, శ్రీనివాసులు, పుష్పలత, నరసింహులు, విద్యార్థులు మహిపాల్‌రెడ్డి, పురేందర్, విష్ణు, దాసు, రమేష్‌శెట్టి, ప్రవీణ్‌కుమార్, వలియోద్దీన్, సుమిత్రబాయి, మంజుల, రాధమ్మ, స్వర్ణలత, లత పాల్గొన్నారు.

డాక్టరేట్ గ్రహీతలకు ఘన సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సభ్యులు

వనపర్తిటౌన్: ప్రముఖ గణితావధాని, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అనంతప్ప, ఉపాధ్యాయుడు రాములు విద్యాబోధనలో, వ్యక్తిత్వ వికాస మెళకువలపై చేసిన పరిశోధనలకు ఇటీవల డాక్టరేట్ ప్రదానం చేయడంతో సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో జిల్లా పాత గ్రంథాలయంలో ఆదివారం సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్, ప్రజా కవి జనజ్వాల మాట్లాడుతూ.. ఏ వృత్తిలో నిబద్ధత ఉంటే విద్యార్థులకు, ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందని తద్వారా సమాజంలో చైతన్యం పెరిగేందుకు దోహదం పడుతుందన్నారు. ప్రవృత్తితో ఉద్యోగ పరిధికి మించి సమాజానికి సేవ చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. సమాజంలో మంచిని పెంచే వ్యవస్థను పెంపొందించేందుకు ప్రాథమిక పునాది విద్యా వ్యవస్థ నుంచే మొదలు అవుతుందన్నారు. విద్యార్థుల్లో శుభ సంకల్పాలపై ధృడత్వం ఏర్పడితే భవిష్యత్ తరాలు సారవంతమైన సమాజాన్ని చూడవచ్చన్నారు. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక రూపంలో ప్రతిభ ఇమిడి ఉంటుందని, అలాంటి ప్రతిభను వెలికి తీసేందుకు ప్రోత్సాహం అందించేందుకు ఎక్కడికక్కడ సహచరులు సహకరించే సంస్కృతి పెరగాలన్నారు. అంతకుముందు గాయకులు రామిరెడ్డి, సత్తార్ ఆలపించిన పాటలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో చంద్రశేఖర్, ఓంకార్, ఖమర్ రెహమాన్, శ్రీనివాసులు, రామచంద్రుడు, చిన్నమ్మ థామస్, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ వర్కర్లను పర్మినెంట్ చేయాలి

వనపర్తిటౌన్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కేజీబీవీ హాస్టల్‌లో పనిచేసే వర్కర్‌లను వెంటనే పర్మినెంట్ చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. రాష్ట్రంలో ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ , నాన్ టీచింగ్ వర్కర్స్‌ను పర్మినెంట్ చేస్తామని మాట ఇచ్చినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి కొన్ని నెలలు గడుస్తున్న ఇప్పటి ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న వర్కర్‌లకి అధిక వేతనాలు ఇస్తున్నారని, అదే తరహాలో సమాన పనిచేస్తున్న కేజీబీవీ వర్కర్‌లకు తక్కువ వేతనాలు ఇవ్వడం సరికాదన్నారు. కార్యక్రమంలో షహీదా, గణేష్, అలివేల, రేవతి, బాలమణి, భాగ్య, సంగీత, స్వర్ణ, పద్మ, మమత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

బావికి రక్షణ గోడ నిర్మించండి



గోవర్ధనగిరి సమీపంలో ప్రమాదకరంగా ఉన్న బావి

వీపనగండ్ల: మండల కేంద్రం నుంచి గోవర్ధనగిరికి డబుల్ బీటి రోడ్డును నిర్మించిన అధికారులు, గోవర్ధనగిరి సమీపంలో రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ఉన్న బావికి రక్షణ గోడను నిర్మించకపోవడంతో ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు ఆవేదన చేస్తున్నారు. రోడ్డుకు అతి సమీపంలో ఉన్న బావిలో అదుపు తప్పి ట్రాక్టర్, ద్విచక్ర వాహనాలు పడిన సంఘటనలు ఉన్నాయి. అధికారులు స్పందించి రక్షణ గోడను నిర్మించాలని గ్రాస్తుఉ కోరుతున్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వాలు పనిచేయాలి

వనపర్తిటౌన్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక విధానాలు మానుకోవాలని అఖిల భారత తపాల ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, రాష్ట్ర కార్యదర్శి శ్రవణ్‌కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తపాలఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు పని చేయాలన్నారు. అనంతరం డివిజన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షరీఫ్, కార్యదర్శిగా శివకుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రవీందర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



ఆత్మకూర్‌లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ భాస్కర్‌సింగ్

వీపనగండ్ల: పదో తరగతి పరీక్షలకు మండలంలోని 175 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. మండలంలో ఏడు ఉన్నత పాఠశాలలోపాటు కేజీబీవీ బాలికల పాఠశాల నుంచి విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరిండెంట్‌గా వెలగొండ హెచ్‌ఎం శ్రీనివాస్, డిపార్ట్‌మెంటల్ అధికారిగా గోవింద్‌ను అధికారులు నియమించారు.

కొత్తకోట రూరల్: నేటి నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల్లో పెద్దమందడి మండలంలో 434మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు ఎంఈవో జయశంకర్ తెలిపారు. మండలంలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, జెడ్పీహెచ్‌ఎస్‌లో 200మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 150 మంది విద్యార్థులతో పాటు బలిజపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన 84మంది జిల్లా కేంద్రంలో పరీక్షలు రాయనున్నట్టు ఎంఈవో తెలిపారు. పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు, ఉదయం 9:30గంటలకు నుంచి మధ్యాహ్నం 12:30 గంటలకు వరకు పరీక్ష ఉంటుందని నిర్ణీత సమయంలో చేరుకోవాలని సూచించారు. కొత్తకోట మండలంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ తెలిపారు. 1,018 విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు, ఇందుకు గాను మండల కేంద్రంలో ఐదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 196 మంది విద్యార్థులు, నివేదిత హైస్కూల్‌లో 210 విద్యార్థులు, ఢిల్లీ ఒలంపియాడ్ స్కూల్‌లో 220 విద్యార్థులు, భారతీయ విద్యామందిర్ హైస్కూల్‌లో 200మంది విద్యార్థులు, ఉషోదయ హైస్కూల్‌లో 192మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు ఎంఈవో పేర్కొన్నారు.



అమరచింతలో..

పాన్‌గల్: పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ సూచించారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలకు మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. బాలుర ఉన్నత పాఠశాలలో 220 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో143 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు.

అమరచింత: మండల కేంద్రంలోని డీఎంఆర్‌ఎం, జెడ్పీఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి మౌలిక వసతులను కల్పించామని ఎంఈఓ భాస్కర్‌సింగ్ తెలిపారు. ఆదివారం ఆయా పరీక్ష కేంద్రాలలోని తరగతి గదులలో విద్యార్థుల హాల్‌టికెట్ నంబర్లను కేటాయింపును పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ మండలం కేంద్రంలో ఈసారి రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో 180 మంది, డీఎంఆర్‌ఎంలో 126 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని తహసీల్దార్ చాంద్‌పాషా, ఎస్‌ఐ సురేష్‌కుమార్ తెలిపారు.

ఆత్మకూర్: పదో తరగతి పరీక్షలకు కేంద్రాల్లో సౌకర్యాలు సమకూర్చామని ఎంఈఓ భాస్కర్‌సింగ్ తెలిపారు. ఆదివారం పట్టణంలో కేంద్రాలను పరిశీలించారు. మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, బాలికల ఉన్నత పాఠశాలలో 189 మంది, బాలుర ఉన్నత పాఠశాలలో 177 మంది, కాలేజీ హైస్కూల్లో 230 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు.

ఉద్యోగులుగా గుర్తించే వరకు పోరాటం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు

పెబ్బేర్ రూరల్: గ్రామపంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు పోరాటాలు కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, కార్యదర్శి పుట్టా ఆంజనేయులు తెలిపారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘం, సీఐటీయూ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. పంచాయతీ కార్మికుల ఐదునెలల బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ, ప్రమాదబీమా, ఇన్సూరెన్స్ తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని, కాంట్రాక్టు విధానాన్ని రద్దుచేసి క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ప్రతినెల 5వ తేదీలోగా వేతనాలు చెల్లించాలని, విధి నిర్వహణలో మృతిచెందిన కార్మికుల కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం తక్షణమే చెల్లించాలన్నారు. కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్, జిల్లా సహాయకార్యదర్శి సూర్యవంశ రాము, మధు, రాములు, పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల సంఘం నాయకులు హన్మంతు, పుష్ప, సుగ్రీవుడు, శ్రీను, దాసు, ఎల్లయ్య, రాము, శివ, అంజనమ్మ, భాగ్యమ్మ, కృష్ణమ్మ, రామచంద్రయ్య పాల్గొన్నారు.